సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

ట్రాకర్ కుటుంబానికి ఆర్థిక అండ

- రూ.2లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే కళావతి



రాంబాబు భార్య గంగమ్మకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఏనుగుల దాడిలో గత ఏడాది మృతి చెందిన సీతంపేట మండలం ఈతమానుగూడకు చెందిన ఎలిఫెంట్ ట్రాకర్ నిమ్మక రాంబాబు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచినట్టు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును వండవ క్యాంపు కార్యాలయంలో రాంబాబు భార్య గంగమ్మకు శనివారం అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ ఆర్తులకు అండగా నిలుస్తోందని, కొన్ని వేల కుటుంబాలకు భరోసా కల్పిస్తోందని కళావతి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీతంపేట నాయకులు నిమ్మక రామారావు, సవర వెంకటేష్, కృష్ణ, వెంకయ్య, పులిపుట్టి పెంటయ్య, తవుడు, యు.మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరు పరిశీలన



ఈవీఎంలో ఓటు నమోదును పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) పనితీరు ప్రదర్శన (డిమానిస్ట్రేషన్)ను పలువురు ఓటర్లు కలెక్టర్ కార్యాలయంలో శనివారం పరిశీలించారు. ఈవీఎంలో ఓటువేశారు. ఏ గుర్తుకు నమోదైంతో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. మొబైల్ ఈవీఎం డిమానిస్ట్రేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రారంభించారు. ప్రతి ఓటరు ఓటువేసి తనిఖీ చేసుకోవాలని సూచించారు. జేసీ ఆర్.గోవిందరావు పలువురికి ఈవీఎంలో ఓటు వేసే విధానాన్ని స్వయంగా వివరించారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు

- క్వింటా సాధారణ రకం రూ.2,183 ఏ–గ్రేడ్ రకం 2,203
- రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి
- కలెక్టర్ నిషాంత్ కుమార్



ధాన్యం తూకంను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

సీతానగరం: ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 185 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులు అమ్మకానికి ఉంచిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని స్పష్టంచేశారు. మండలంలోని సూరంపేట రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలోని తూనిక యంత్రం పనితీరును పరిశీలించారు. ధాన్యం రవాణాకు టెంకాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాకు సాధారణ రకం 2,183, గ్రేడ్–ఎ రకం రూ.2,203లు పొందాలని రైతులకు సూచించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్‌రూమ్ పనిచేస్తుందని చెప్పారు. జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 08963 -293037, 77020 03582 నేరుగా ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలన్నారు. రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ నంబర్ 1800–4251967, రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ నంబర్ 1967 కూడా పనిచేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు.

కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఏడీఏ వెంకటేష్, ఏఓ ఎస్.అవినాష్, సర్పంచ్ సీహెచ్ అప్పన్నమ్మ, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఈశ్వరనారాయణ పాల్గొన్నారు.

‘మిచాంగ్’పై అలర్ట్

- అధికారులు, ఉద్యోగులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలి
- కంట్రోల్ రూమ్‌లు కలెక్టర్ కార్యాలయం:08963-293046
- పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయం: 8500525011
- పాలకొండ ఆర్డీఓ కార్యాలయం: 95027 22212



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: మిచాంగ్ తుపానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను హెచ్చరికలు నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసినట్టు వెల్లడించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌సీ, సీహెచ్‌డబ్ల్యూఓలతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం, పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయం, పాలకొండ ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, గర్భిణులను దృష్టిలో పెట్టుకొని వారికి అవసరమైన పాలు, బిస్కెట్‌లు, రొట్టెలు తదితర సామగ్రిని సిద్ధంగా ఉంచాలన్నారు. పంచాయతీ రాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, ఆనకట్టలను తనిఖీ చేయాలన్నారు. మత్స్యకారులను నదులు, చెరువుల్లోకి వేటకు వెళ్లకుండా సూచనలు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. 27 రహదారి క్లియరెన్స్ బృందాలు ఏర్పాటు చేశామని జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు, ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్‌ఓ జె.వెంకటరావు, కేఆర్‌సీసీ ఎస్‌డీసీ జి.శివకేశవనాయుడు, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల కోఆర్డినేటర్ బి.వాగ్దేవి, డుమా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఒ.ప్రభాకరరావు, పీఆర్ ఈఈ కృష్ణాజీ, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, మత్స్యశాఖాధికారి తిరుపతయ్య పౌరసరఫరాల మేనేజర్ ఎం.డి.నాయక్, రవాణాశాఖాధికారి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

రైలులో పుణ్యక్షేత్ర యాత్ర

- ఐఆర్‌టీసీ ఏరియా మేనేజర్ చంద్రమోహన్



పుణ్యక్షేత్రయాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ చంద్రమోహన్

పార్వతీపురం టౌన్: ఇండియన్ రైల్వే భారత్ గౌరవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ చేపట్టిన పుణ్యతీర్థయాత్రను సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ చంద్రమోహన్ కోరారు. పార్వతీపురం (బెలగాం రైల్వేస్టేషన్) రైల్వే స్టేషన్‌లో విలేకరులతో ఆయన శనివారం మాట్లాడారు.

భారతదేశంలోని పుణ్యక్షేత్రాలను భక్తులకు చూపించాలని ఇండియన్ రైల్వే సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐఆర్‌టీసీ సంకల్పించిందన్నారు. డిసెంబర్ 9వ తేదీన హైదరాబాద్‌లో బయలుదేరిన పుణ్యతీర్థ ఎక్స్‌ప్రెస్ అదే రోజు పెందుర్తి, విజయనగరంలో ఆగుతుందన్నారు. 8 రాత్రులు, 9 పగళ్లు ప్రయాణికులకు అల్పాహారంతో పాటు భోజన, వసతి, వాహన సౌకర్యాలను ఐఆర్‌సీటీసీ కల్పిస్తుందన్నారు. తీర్థయాత్ర స్పెషల్లో పూరిలోని జగన్నాథ ఆలయం, గయ, విష్ణుపాద, వారణాశి కాశీ విశ్వేశ్వర, అన్నపూర్ణ, విశాలాక్షి, అయోధ్య రామజన్మ భూమి, ప్రయోగరాజ్ త్రివేణి సంగమం, హనుమాన్ ఆలయాల దర్శనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సూపర్ వైజర్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్షకు వేళాయె



పార్వతీపురం డీవీఎంఎం పాఠశాలలో మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

జిల్లాలో పరీక్ష కేంద్రాల వివరాలు ఇలా..

పరీక్షా కేంద్రం	పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య
జీహెచ్‌ఎస్ పాలకొండ	192
జెడ్పీహెచ్‌ఎస్(బాలికలు)పాలకొండ	168
జెడ్పీహెచ్‌ఎస్ పాలకొండ(పీకె వీధి)	199
జీజీహెచ్‌ఎస్, పార్వతీపురం	144
జీహెచ్‌ఎస్ పార్వతీపురం	158
డీవీఎంఎం హైస్కూల్, పార్వతీపురం	168
కేపీఎం హైస్కూల్ , పార్వతీపురం	240
టీఆర్‌ఎంఎం హైస్కూల్ , పార్వతీపురం	144

పార్వతీపురంటౌన్: ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు అందిస్తోంది. నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు (తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు) ఆర్థిక సాయం అందిస్తోంది. నెలకు రూ.1,000 వంతున ఏడాదికి రూ.12వేలు ఉపకార వేతనం ఇస్తోంది. దీనికోసం ఏటా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. ఈ నెల 3వ తేదీ ఆదివారం నిర్వహించే ప్రవేశ పరీక్షకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది. ప్రశ్నపత్రాలను ఇప్పటికే పోలీస్ స్టేషన్లలో భద్రపరిచినట్టు డీఈఓ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

424 కిలోల గంజాయి స్వాధీనం

- వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు
- అతివేగంతో వాహనం బోల్తా



పట్టుబడిన గంజాయితో ఎస్.కోట ఎస్ఈబీ అధికారులు

శృంగవరపుకోట: ఎస్ఈబీ అధికారులు పక్కా సమాచారంతో దాడిచేసి రూ.50లక్షలు విలువచేసే 424 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్.కోట ఎస్ఈబీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్.వెంకటరావు గంజాయి కేసు వివరాలు వెల్లడించారు. కమిషనర్ ఎం.రవిప్రకాశ్, డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఎస్పీ మహేశ్వరరాజుకు అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఎస్.కోట వైపు భారీగా గంజాయి రవాణా అవుతున్నట్టు సమాచారం వచ్చింది. దీంతో సిబ్బందిని అప్రమత్తం చేశాం. శుక్రవారం రాత్రి రెండు వాహనాలతో డీటీఎఫ్, ఎస్.కోట ఎస్ఈబీ, సిబ్బందితో గస్తీ కాశాం. బొడ్డవర చెక్ పోస్టులో పోలీసులు వాహనాన్ని ఆపే ప్రయత్నం చేసినా, డ్రైవర్ అతివేగంగా గంజాయి ఉన్న బొలేరో వాహనాన్ని తాటిపూడి రోడ్డులోకి మళ్లించాడు. రెండు వాహనాల్లో ఎస్ఈబీ, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బొలేరో వాహనాన్ని వెంబడించారు. అతివేగంతో వెళ్తున్న బొలేరో నవోదయ స్కూల్ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌ను , బొలేరో వాహనంలో ఉన్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ కొర్రా రమేష్ గంజాయిని వేపాడ మండలంలోని బొద్దాం గ్రామానికి తరలిస్తున్నట్టు చెప్పాడని, దీనిపై పూర్తిస్థాయి విచారణకు టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఎస్.కోట పోలీసులు సహకారం అందించారన్నారు.

క్లుప్తంగా

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

• ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో పార్వతీపురంమన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, అధికారులు, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. సచివాలయాలు, ఆర్‌బీకేల్లో పనిచేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యోగులు వలంటీర్లతో రైతులను, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కోసిన వరి చేనును కుప్పల పెట్టించడం, ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, టార్పాలిన్లతో పంటలను రక్షించుకునే చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 6న తుపాను తీరందాటేవరకు పంటలు కోయవద్దన్నారు.

రేపటి నుంచి 'మిచాంగ్' ప్రభావం

• జేసీ మయూర్ అశోక్


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ ప్రభావం జిల్లాలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ మధ్యలో ఉంటుందని జేసీ కె. మయూర్ అశోక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి కోతలు వాయిదా వేసుకోవాలని, నూర్పిడి చేసిన పంటను సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు. పత్తి పంట రెండో ఏరివేతకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో వెంటనే ఏరివేయాలన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


లారీ ఢీకొనడంతో మృతి చెందిన బుచ్చినాయుడు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి-26పై శనివారం సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ ఎస్.రవి తెలిపిన వివరాల ప్రకారం.. గొట్లాం గ్రామానికి చెందిన తాళ్లపూడి బుచ్చినాయుడు(55) సైకిల్‌పై గొట్లాం బైపాస్ రోడ్డు నుంచి ఇంటికి వస్తుండగా అక్కడకు సమీపంలోని గ్రాండ్‌ఫుడ్ కోర్టు దాబాకు దగ్గరలో పార్వతీపురం వైపు నుంచి విజయనగరం వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. తీవ్రగాయాలపాలైన ఆయన అక్కడిక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య లక్ష్మితో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించామన్నారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శ్రద్ధ


నరవ పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గంట్యాడ: యువ ఓటర్ల నమోదుపై బీఎల్ఓ(బూత్ లెవల్ ఆఫీసర్)లు దృష్టి సారించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మండలంలోని రామవరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరవ ఎంపీయూపీ స్కూల్ పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. బీఎల్‌ఓల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఫారం-6, 7, 8లను పరిశీలించి, 18 ఏళ్లు దాటిని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని బీఎల్‌ఓ సర్వే చేయాలన్నారు. మరణించిన వారి ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి పేర్లు తొలిగించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ పి.నీలకంఠేశ్వ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్ ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, రెండు అంగన్‌వాడీ సహాయకుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ఎం.ఎస్.రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వివాహితులు ఈనెల 5 నుంచి 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹80	₹130	₹140

దివ్యాంగులకు ఉజ్వల భవిత


రామభద్రపురం భవిత కేంద్రం

• దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం
• భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ, ఆరోగ్య పరిరక్షణ
• ఉచితంగా ఉపకరణాల పంపిణీ
• చదువు, ఉద్యోగాల్లో ప్రోత్సాహం
• డిజిటల్ విద్యాబోధనకు అనువుగా ట్యాబ్‌ల పంపిణీ
• నెలనెలా ఠంచన్‌గా పింఛన్ అందజేత
• నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

రామభద్రపురం: దివ్యాంగుల సంక్షేమానికి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. వివిధ సంక్షేమ పథకాల కింద ఆర్థిక తోడ్పాటుతో పాటు ఊరూరా వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తోంది. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రమాణాలతో కూడిన విద్యను బోధించేందుకు శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించింది. వారి 'భవిత'కు గట్టి పునాది వేస్తోంది. దివ్యాంగులకు నెలనెలా ఠంచన్‌గా పింఛన్‌తో పాటు వైద్యసేవలను ఉచితంగా అందిస్తోంది. జీవన భరోసా కల్పిస్తోంది. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం (డిసెంబర్-3) సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఓ సారి పరికిద్దాం.


ఫిజియో థెరపీ చేస్తున్న వైద్యురాలు

డిజిటల్ బోధన

శారీరక వైకల్యంతో బాధపడుతూ తోటి పిల్లలతో సమానంగా చదువుకోలేక తల్లడిల్లే చిన్నారుల బంగారు భవిత కోసం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేక యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. జిల్లాలో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 119 మంది వినికిడి, దృష్టిలోపంతో బాధపడే విద్యార్థులు, 54 మంది ఐఈఆర్టీలు, ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్న 36 మంది ప్రత్యేక ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు అందజేశారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులందరూ ట్యాబ్‌లు వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచారు.


ప్రత్యేకఅవసరాల పిల్లలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, ఎంఈఓ తిరుమల ప్రసాదరావు

ఆర్థిక తోడ్పాటు

దివ్యాంగులు వివిధ యూనిట్లు ఏర్పాటుకు రాయితీతో కూడిన రుణాలతో పాటు, నెలనెలా రూ.3000 చొప్పున ఠంచన్‌గా ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. దివ్యాంగుల ఆర్థిక ఎదుగుదలకు సహకరిస్తోంది.


రామభద్రపురంలో దివ్యాంగురాలు నారాయణమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ గౌరి

అన్నింటా ప్రోత్సాహం

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉజ్వల భవితను అందించేందుకు జిల్లాలో ఉన్న 27 భవిత కేంద్రాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బలోపేతం చేసింది. అందులో ప్రస్తుతం చదువుతున్న 539 మంది దివ్యాంగ పిల్లలకు ప్రమాణాలతో కూడిన విద్యాబోధనకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించింది. భవిత కేంద్రాల్లో పిల్లల వైకల్యం నిర్ధారణ, పూర్వ ప్రాథమిక దశలో ఉన్న సమస్య గుర్తింపు, ఉచిత ఉపకరణాల పంపిణీ, ఇంటి వద్దనే విద్య, చిన్నపాటి శస్త్ర చికిత్సలకు సహకారం, పిల్లల పెంపకంపై తల్లిదండ్రులకు శిక్షణ ఇస్తోంది. ఫిజియో థెరిపీ, స్పీచ్ థెరిపీ, దృష్టిప్రేరణ విద్యాబోధన, బ్రెయిలీలిపి వంటి సేవలందిస్తూ వివిధ లోపాలతో జన్మించిన పిల్లల్లో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తోంది. భవిత కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్ అలవెన్సు, హోంబేస్డ్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, చికిత్స, రవాణా భత్యాలను ఒక్కొక్కరికీ నెలకు రూ.300 చొప్పున సమకూర్చుతోంది. గార్డ్ స్టైఫండ్ కింద నెలకు రూ.200 చొప్పున అందజేస్తోంది.

ప్రత్యేక శ్రద్ధ



భవిత కేంద్రాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా భవిత కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తోంది. వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, వీల్ చైర్‌లు, నాణ్యమైన పరికరాలు అందిస్తోంది. ప్రత్యేక యాప్‌తో కూడిన ట్యాబ్‌లు సైతం సమకూర్చుతోంది. దివ్యాంగులు ఎలాంటి దరఖాస్తు చేయకుండా ప్రభుత్వమే గుర్తించి, కావాల్సిన సదుపాయాలు కల్పిస్తుండడం సంతోషదాయకం.

– సిరికి సూర్యారావు, సహిత విద్యా కో ఆర్డినేటర్

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. జిల్లాలో చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయంఉపాధి పొందుతూ ఆర్థికాభివృద్ధి చెందేందుకు రుణాలు ఇస్తోంది. జిల్లాలో సుమారు 83 మందికి రూ.2 కోట్ల రుణాలు ఇచ్చాం. ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు మంజూరు చేశాం. జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపయోగపడేలా డీడీఆర్సీ (డిస్ట్రిక్ట్, డిజేబుల్డ్, రియాబ్లిటేసన్ సెంటర్) ఏర్పాటు చేయున్నాం. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– జి.జగదీష్, ఏడీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ, విజయనగరం

వాహన సేవ

జిల్లాలో 23వేల మంది ప్రత్యేకవసరాలు గల పిల్లలు, పెద్దలు ఉన్నారు. వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటోంది. ఇటీవల రూ.3.30 కోట్లు విలువ చేసే మోపెడ్స్, బ్యాటరీ వాహనాలు, చెవిటి మిషన్లు, మూడు చక్రాల వాహనాలు, చేతి కర్రలు వంటి పరికరాలను 2,300 మంది దివ్యాంగులకు సమకూర్చింది. ఇందులో రూ.లక్ష విలువ చేసే మోపెడ్‌లను సుమారు 70 మందికి అందజేయగా, 432 మందికి ఒక్కొక్కరికి రూ.42 వేలు విలువ చేసే బ్యాటరీ వాహనాలను అందజేసింది.



జాతీయస్థాయి పోటీలకు లక్కిడాం యువకుడు

గంట్యాడ: జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన గొల్లు కుమార్ ఎంపికయ్యాడు. ఈ నెల 29 నుంచి జనవరి 8వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్ ఈటానగర్‌లో జరగబోయే జాతీయస్థాయి సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 73 కేజీల విభాగంలో ఆంధ్రా తరఫున తలపడనున్నాడు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపించి అర్హత సాధించినట్టు కుమార్ తెలిపాడు.


శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న కుమార్ (ఫైల్)

నేడు జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్టు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి డి.వి.చారిప్రసాద్ శనివారం తెలిపారు. నగరంలోని విజ్జీ స్టేడియం ప్రాంగణంలో నిర్వహించే సబ్ జూనియర్స్, కేడిట్ విభాగాల్లో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఎంపిక పోటీల్లో క్రీడాకారుల గుర్తింపు కార్డు, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలన్నారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనాలని కోరారు.

పైడితల్లి ఆభరణాల లెక్కింపు

విజయనగరం టౌన్:

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన ఆభరణాలను కార్యాలయ ఆవరణలో అధికారులు శనివారం లెక్కించారు. ఆభరణాల రికార్డులను ఆలయ ఈఓ కె.ఎల్. సుధారాణి సమక్షంలో పరిశీలించారు. అమ్మవారి ఆభరణాల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంటామని, అందులో భాగంగా తనిఖీలు చేసినట్టు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో తనిఖీ అధికారులు అల్లు వెంకటదుర్గాభవానీ, సిబ్బంది పాల్గొన్నారు.


అమ్మవారి ఆభరణాల రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలు పరిశీలన

సీతానగరం: ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని జేసీ రోణంకి గోవిందరావు స్పష్టం చేశారు. మండలంలోని పెదభోగిలి రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతు కొల్ల శ్రీనివాసరావు కల్లాం నుంచే ధాన్యం కొనుగోలులో భాగంగా నాణ్యతను, తేమశాతాన్ని పరిశీలించారు. తుపాను దృష్ట్యా వరి చేనును భద్రపరుచుకోవాలని సూచించారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ చొరవతో పార్వతీపురం మన్యం జిల్లాలో ముందుగానే ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ రాబర్ట్‌పాల్, పౌరసరఫరాల అధికారి నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ సభ్యులు ఎం.బాబ్జీ, ఏఓ ఎస్.అవినాష్ పాల్గొన్నారు.


ధాన్యం రకాలను పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు

జిల్లాలో రెండు కొత్త పోలీస్ సర్కిల్స్

• సీఐ స్థాయి అధికారికి ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు
• అందుబాటులో పోలీస్ సేవలు

శృంగవరపుకోట: రాష్ట్ర పోలీస్ యంత్రాంగం పరిపాలనా సౌలభ్యం కోసం కొత్తసర్కిళ్లను ఏర్పాటు చేసింది. ఈ మేరకు జీఓం 192ను జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 100 ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఇందులో భాగంగా జిల్లాలో ఎస్.కోట, భోగాపురంలలో రెండు కొత్తసర్కిళ్లను ఏర్పాటు చేస్తూ అధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు ఎస్.కోట మండలం ఒక సర్కిల్‌గా, భోగాపురం మండలం ఒక సర్కిల్‌గా ఏర్పాటు కానుంది. ఆయా సర్కిల్స్‌లో ఇక నుంచి సీఐ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌ఓగా వ్యవహరిస్తారు. ఇందులో భాగంగా ఎస్.కోట ఎస్‌ఐగా పనిచేస్తున్న తారకేశ్వరరావును విజయనగరం వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఎస్.కోట సర్కిల్ పరిధిలో జామి, ఎల్.కోట, వేపాడ, ఎస్.కోట మండలాలు ఉన్నాయి. పెరిగిన పనిఒత్తిడి, కేసుల సంఖ్య తదితర అంశాల ఆధారంగా ఎస్.కోటను కొత్త సర్కిల్‌గా ఏర్పాటు చేశారు. మరింత కచ్చితమైన నిఘా, పర్యవేక్షణతో పాటు సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి.


కొత్త సర్కిల్‌గా ఏర్పాటు కానున్న ఎస్.కోట పోలీస్‌స్టేషన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన దాడి అప్పలనాయుడు

గజపతినగరం: జాతీయ రహదారిపై గజపతినగరం అపోలో మెడికల్ షాపు సమీపంలో శనివారం ఆటో ఢీకొట్టడంతో వృద్ధుడు గాయపడ్డాడు. మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి చెందిన దాడి అప్పలనాయుడు(65) రోడ్డు గుండా నడిచి వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వైద్యసేవల కోసం 108 వాహనంలో విజయనగరం సర్వజన ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసును నమోదు చేశారు.

మరో సైబర్ మోసం

• రూ.17.50 లక్షలు దోచుకున్న వైనం

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన ఓ బాధితుడు రూ.17.50 లక్షలు కోల్పోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణమూర్తి శనివారం తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెలలో బాధితుడి సెల్‌కు అగంతుకుడు ఫోన్ చేసి విదేశీ టూర్ ప్లాన్ ఉందని చెప్పి పలు దఫాలుగా రూ. 17.50 లక్షలు దోచుకున్నాడు. ఈ సమయంలో బాధితుడి ఆధార్‌కార్డు, ఫొటో తీసుకున్నారు. కొద్ది రోజుల తర్వాత టూర్ కోసం బాధితుడు ఆరా తీయగా.. అతని ఫొటోను మార్ఫింగ్ చేసి బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేశారు.

అండర్-19 క్రికెట్ పోటీలకు జిల్లా బాలుర జట్టు


విజయవాడలో క్రికెట్ పోటీలకు బయలుదేరిన జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ జట్టు

• నేటి నుంచి విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలు

విజయనగరం: విద్యార్థి దశలో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న అండర్-19 స్కూల్‌గేమ్స్ క్రికెట్ పోటీలకు జిల్లా బాలుర జట్టు శనివారం పయనమైంది. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు విజయవాడలో జరగనున్న పోటీల్లో జిల్లా నుంచి 14 మంది క్రీడాకారుల బృందం ప్రాతినిథ్యం వహించనుంది. క్రీడాకారులను అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ అభినందించి పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో పలువురు పీడీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.